01ATP06 F_01ATP06 F.qxd 06-02-2026 PM 10:55 Page 1






అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శనివారం 07 ఫిబ్రవరి 2026 | పేజీలు : 04


# సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకల కోసం ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలి

### - 13, 14, 15 తేదీల్లో జయంతి వేడుకలు - జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్




మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ , కార్యక్రమానికి హాజరైన అధికారులు

**అనంతపురం, ఫిబ్రవరి 06 ప్రభాతవార్త బ్యూరో**

శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకల కోసం ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో శ్రీ సేవాలాల్‌మహరాజ్ జయంతి వేడుకలపై సంబంధిత శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 13, 14, 15వ తేదీలలో గుత్తి మండలం సేవాగఢ్‌లో నిర్వహించే శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను సజావుగా నిర్వహించాలన్నారు. వేడుకల కోసం పోలీస్ వారు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు, ట్రాఫిక్, బ్యారికేడ్ ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్టీసీ నుంచి బస్సులు ఏర్పాటు చేయాలని, గుత్తి గుంతకల్లు మధ్యలో సేవాగఢ్ వద్ద స్టాపింగ్ ఏర్పాటు చేయాలని, అవసరమైతే అదనపు బస్సులను కేటాయించాలని ఆదేశించారు. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో సేవాలాల్‌కు వెళ్లే రోడ్‌లో జంగిల్ క్లియరెన్స్ చేయాలని, గుంతలు పూడ్చాలని, పార్కింగ్ ప్రాంతాలను శుభ్రం చేయాలని, అవసరమైనచోట బ్యారికేడింగ్ చేయాలని, శానిటేషన్ జాగ్రత్తగా చేపట్టాలన్నారు. ఎస్పిడిసిఎల్ ఆధ్వర్యంలో నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని, ఆర్డబ్ల్యుఎస్ శాఖ నుంచి తాగునీటిని అందుబాటులోఉంచాలని, టాయ్ లెట్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఫైర్ సేఫ్టీ పాటిస్తూ స్టాల్ ఏర్పాటు చేయాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ నుంచి మూడురోజులపాటు మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని, 104, 108 వాహనాలను కూడాఅందుబాటులోఉంచాలన్నారు. అన్ని శాఖల అధికారులతో డిటిడబ్ల్యుఓ సమన్వయం చేసుకోవాలని, జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో గుంతకల్లు ఆర్డీఓ ఏబీవీఎస్పి శ్రీనివాస్, గుంతకల్లు డిఎస్పీ శ్రీనివాస్, డిటిడబ్ల్యుఓ శ్రీనివాసరావు, శ్రీ సేవాలాల్ మహరాజ్ ట్రస్ట్ అధ్యక్షుడు కేశవనాయక్, ట్రస్ట్ నుంచి అశ్వత్థనాయక్, బాలానాయక్, డీఎల్డిఓ విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ శ్రీనివాసులు, ఆర్.అండ్.బి డిఈఈ సత్యనారాయణ, గుత్తి, గుంతకల్లు తహసీల్దార్లు పుణ్యవతి, రమాదేవి, జిల్లా టూరిజం అధికారి జయకుమార్ బాబు, ఆర్‌అండ్బి ఎస్ఈ మురళీ కృష్ణ, ఏపీఎస్ఆర్టీసీ డిఎం ఖాజా వలి, గుత్తి పిఎస్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రామారావు, ఎంపీడీవో ప్రభాకర్, పీఆర్ ఏఈఈ మల్లేష్ నాయక్, ఎస్పిడిసిఎల్ డిఈ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పోలీసులపై మోస్ట్‌వాంటెడ్ క్రిమినల్ దాడి

### - సిఐ, కానిస్టేబుల్‌కు గాయాలు - ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపిన పోలీసులు

### - వైద్యంనిమిత్తం హిందూపురం ఆసుపత్రికి తరలింపు





గాయపడిన సిఐ , గాయపడిన కానిస్టేబుల్ రవి , నిందితుడు నాగేంద్ర (ఫైల్‌ఫోటో)

**చిలమత్తూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**

రాష్ట్రంలో 90కిపైగా కేసులు నమోదై 2024 అక్టోబర్‌లో టేకులోడు గ్రామ సమీపంలో అత్తాకోడలిపై జరిగిన సామూహిక అత్యాచారంలో ప్రధాన నిందితునిగా వున్న హిందూపురంకు చెందిన కావడి నాగేంద్ర అలియాస్ రోబో అనే మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ చిలమత్తూరు మండల పరిధిలోని కనుమ ఎర్రకొండ అటవీప్రాంతంలో శుక్రవారం తెల్లవారుజామున పోలీసులపై దాడి చేసి గాయపరిచిన సంఘటన జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. వివరాలు ఇలా వున్నాయి. పలు కేసుల్లో కీలక ముద్దాయిగా వున్న నాగేంద్రను పట్టుకునేందుకు కోర్టు నుండి వారెంట్లు జారీ అయ్యాయి. విధి నిర్వహణలో భాగంగానే కోర్టు ఆదేశాలను అనుసరించి నాగేంద్రపై రెక్కీ పెట్టిన పోలీసులకు శుక్రవారం తెల్లవారుజామున హిందూపురం నుండి చిలమత్తూరు వయా కొడికొండ చెక్‌పోస్టులోని 44వ జాతీయ రహదారిగుండా బెంగుళూరు వెళుతున్నాడన్న పక్కాసమాచారం చిలమత్తూరు పోలీసులకు అందింది. చిలమత్తూరు ఎస్ఐ మునీర్‌అహమ్మద్ తో పాటు మరో ఇద్దరు కానిస్టేబుళ్లు పకడ్బంధీగా ఎర్రకొండ అటవీప్రాంతంవద్ద కాపుకాస్తూ ద్విచక్రవాహనంపై వచ్చిన నాగేంద్రను పోలీసులు అడ్డుకున్నారు. ముద్దాయి నాగేంద్ర హిందూపురం అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రవి భుజానికి కత్తితో పొడిచి అక్కడి నుండి అటవీప్రాంతం వైపు పారిపోయాడు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు చిలమత్తూరు పోలీసులు



పోలీసుల అదుపులో నిందితుడు నాగేంద్ర

తెలపగా హిందూపురం నుండి ఒక ప్రత్యేక బృందంతో పాటు చిలమత్తూరు నుండి ఒక ప్రత్యేక బృందం రెండు బృందాలుగా ఏర్పడిన పోలీసులు అటవీప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగించారు. ఇందులో భాగంగా ముద్దాయి నాగేంద్ర పోలీసుల కంట పడడంతో చట్టబద్దంగా లొంగిపో అని ఎంత చెప్పినా వినకుండా నిందితుడు మరోసారి తన చేతిలోని కత్తితో హిందూపురం సిఐ చంద్రాంజనేయులు ఛాతిపై తీవ్రంగా గాయపర్చడంతో స్వీయ ఆత్మరక్షణ కోసం పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ముద్దాయి నాగేంద్ర కాలికి గాయమైంది. అక్కడి నుండి హుటాహుటిన మొదట గాయపడిన కానిస్టేబుల్ రవితో పాటు సిఐ చంద్రాంజనేయులు, ముద్దాయి నాగేంద్రలను చికిత్స నిమిత్తం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి రూరల్ సిఐ జనార్ధన్, ఎస్ఐ మునీర్‌అహమ్మద్‌లు తరలించారు. ఈ మేరకు హిందూపురం డిఎస్‌పి మహేష్ పై విధంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒక్కసారిగా సిఐ, కానిస్టేబుల్‌పై దాడి జరిగిందన్న వార్త తెలియడంతో పలు రాజకీయపార్టీల నాయకులు ఆసుపత్రికి వెళ్లి వారిని పరామర్శించారు.

# వికసిత్ భారత్2047 లక్ష్యసాధన కోసం అడుగు వేద్దాం

### విద్యార్థులతో ముఖాముఖిలో మంత్రి సత్య కుమార్ వ్యాఖ్యలు




విద్యార్థులతో కలిసిప్రధానిమోదీకార్యక్రమాన్ని వీక్షిస్తున్న మంత్రి సత్య కుమార్ , రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్నమంత్రిసత్యకుమార్

**ముదిగుబ్బ ఫిబ్రవరి6 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన ముదిగుబ్బలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భం గజడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల ముఖాముఖి కార్యక్రమం లో పాల్గొన్నారుమంత్రి మాట్లాడుతూవికసిత్ భారత్ దిశగా దేశంముందుకు సాగుతున్న తరుణంలో విద్యార్థుల పాత్ర అత్యంత కీలకమని ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తును నిర్దేశించేశక్తిగామారుతారని ఆయన వ్యాఖ్యానించారు. వికసిత్ భారత్ 20047 లక్ష్యాన్ని సాధించడమే ప్రతి విద్యార్థి ముందున్న ప్రధాన బాధ్యతని ప్రధాని పిలుపునిచ్చారన్నారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ స్థానిక బాలికల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాల గదిలో నిర్వహించిన ప్రధానమంత్రి పదవ తరగతి 2026 ప్రత్యక్ష కార్యక్రమాన్ని మంత్రివిద్యార్థులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలను విద్యార్థులకు వివరిస్తూమంత్రి సత్యకుమార్మాట్లాడుతూనేటి విద్యార్థులే రేపటి నాయకులు విద్య .విజ్ఞానం .సాంకేతికత. వైద్యం. పరిపాలన. క్రీడలు వంటి అన్ని రంగాల్లో భారతదేశం ప్రపంచంలో అగ్రస్థానంలో నిలవాలంటే మీలాంటి యువత కష్టపడి ముందుకు రావాలని ప్రధాని చెప్పిన మాటలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ధర్మవరం ఇంచార్జ్ మధుసూదన్ రెడ్డి. జిల్లా కలెక్టర్ మరియు ధర్మవరం ఆర్డీవో ముదిగుబ్బ తాసిల్దార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గరికపాటి ఆధ్యాత్మిక ప్రవచనాల వేదికను పరిశీలించిన ఎమ్మెల్యే అమిలినేని

### ప్రవచనాల్లో పాల్గొనాలి ఆలయ కమిటీ చైర్మన్ దేవినేని అవినాష్ పిలుపు

**కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**

శ్రీశ్రీశ్రీ పట్టాభి రామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం నిర్వహించనున్న డాక్టర్ బ్రహర్షి గరికపాటి నరసింహారావు ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు శుక్రవారం రాత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమం కళ్యాణదుర్గం పట్టణంలోని కరణం చిక్కప్ప క్రీడా మైదానంలో జరగనుంది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, జిల్లా ఎస్పీ పి. జగదీష్ హాజరుకానున్న నేపథ్యంలో భద్రత, వేదిక, భక్తుల సౌకర్యాలు తదితర అంశాలపై ఎమ్మెల్యే అధికారులతో చర్చించి అవసరమైన సూచనలు చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దేవినేని అవినాష్, డీఎస్పీ రవిబాబు, మున్సిపల్ కమిషనర్ వంశీ కృష్ణ భార్గవ్, ఆలయ కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ దేవినేని అవినాష్ మాట్లాడుతూ, గరికపాటి నరసింహారావు గారి ఆధ్యాత్మిక ప్రవచనాలు భక్తులకు



ప్రవచనాల సభా వేదిక ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

ఆధ్యాత్మిక శాంతి, స్ఫూర్తిని అందిస్తాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని భక్తులు, ఆధ్యాత్మిక సేవకులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి భక్తి భావంతో ఈ ప్రవచనాల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# అద్దె గదుల్లో 'అద్దె' మాయం..!

- పంచాయతీ ఆదాయంతో 'వేళాకోలం'..!
- గదుల అద్దె బకాయిల వసూళ్లపై నీలినీడలు
- రూ. 1.72 కోట్ల ఆదాయం కోల్పోయిన పంచాయతీ
- అద్దె గదులకు వేలాలు నిర్వహించని పాలకవర్గం



ప్రారంభానికి ఏడేళ్లుగా ఎదురు చూస్తున్న పంచాయతీ గదుల సముదాయం



ఈ అద్దెగదుల అద్దె ఎటు పోతోందో అధికారులకే తెలియదట

**యాడికి(తాడిపత్రి), ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:**

ఒకప్పుడు జిల్లాలో కీలక పంచాయతీగా ఉన్న యాడికి మేజర్ పంచాయతీ తీరు ప్రస్తుతం ఆందోళనకరంగా మారింది. చెప్పుకోవడానికి రూ. కోట్ల విలువైన అద్దెగదులు, ఆస్తులున్నా వాటి నుంచి నయాపైసా రావడం లేదు. పట్టణ నడిబొడ్డున, బస్టాండులో వ్యాపారవకాశాలు మెండుగా ఉన్న ప్రదేశంలో నిర్మించిన 24 అద్దె గదుల ద్వారా ఏడాదికి సుమారు రూ. 30 లక్షలు పంచాయతీకి ఆదాయం రావాల్సి ఉండగా పైసా వచ్చే పరిస్థితి లేకపోవడం విడ్డూరం. కుంట ముఖద్వారానికి ఎడమ వైపున్న 5 అద్దె గదులకు 10 ఏళ్లుగా పైసా అద్దె చెల్లించడం లేదు. కుంట ముఖద్వారానికి కుడివైపున్న 5 అద్దె గదులకు గతేడాది మార్చితో మూడేళ్ల గడువు ముగిసినా తిరిగి వేలం నిర్వహించకపోవడం, అప్పటి నుంచి గదుల అనుభవదారులు చెల్లిస్తున్న అద్దెలు ఎవరి జేబులోకి పోతున్నాయో అర్థం కాని పరిస్థితి. ఇక స్పర్శ స్వచ్ఛంధసంస్థ ఆర్థికసహాయంతో 2019లో నిర్మించిన వాణిజ్య సముదాయ భవనం అధికారుల పట్టింపులేనితనంతో ఏడేళ్లుగా ప్రారంభానికి నోచుకోక ఎదురు చూస్తోంది. ఇందులోని 14 గదులు వినియోగంలోకి వచ్చింటే ఏడాదికి సుమారు రూ. 17 లక్షలు ఆదాయం వచ్చేది. పాలక వర్గాల నిర్లక్ష్యం,అధికారుల అలసత్వం వెరసి ఈ 24 అద్దె గదులకు ఈ 10 ఏళ్ల కాలంలో దాదాపు 1.72 కోట్ల ఆదాయాన్ని పంచాయతీ కోల్పోవాల్సి వచ్చింది.

**రూ. లక్షలు వెచ్చించినా నెరవేరని లక్ష్యం..!**

యాడికి బస్టాండులో అత్యంత సౌకర్యవంతమైన చోట రూ.60 లక్షలు వెచ్చించి స్పర్శ స్వచ్ఛంద సంస్థ 2019లో కింద, పైన కలిపి 14 గదులను నిర్మించి పంచాయతీ పరం చేసింది. అప్పటి నుంచి కోర్టులో నెలకొన్న వివాదానికి తెరదించడంలో అధికారులు చిత్తశుద్ధి చూపించకపోవడంతో నేటికీ ఈ భవన సముదాయం ఖరీదైన దిష్టిబొమ్మగా మిగిలిపోయింది. కోర్టు చుట్టూ తిరగడానికి పంచాయతీ నిధులు రూ. లక్షల్లో ఖర్చు చేశారే కాని సరైన శ్రద్ధ చూపలేదనే





విమర్శలు వినిపిస్తున్నాయి. సరైన కౌంటర్ దాఖలు చేయకపోవడం, న్యాయవాదులతో సమన్వయం లేకపోవడంతో ఏళ్ళు గడుస్తున్నా రూ. లక్షలు వెచ్చించిన లక్ష్యం నీరుగారిపోతోంది. ఇందులోని ఒక్కో గది రూ. 10 వేలకు అద్దెకిచ్చినా ఏడాదికి రూ. 16.80 లక్షల వంతున ఇప్పటి వరకు ఏడేళ్లకు సుమారు రూ. 1.17 కోట్ల ఆదాయం పంచాయతీకి సమకూరేది. ఇందులోని గదులను కొందరు నాయకుల పోటీపడి తమకు నచ్చినవారికి ఉచితంగా వాడుకోమంటూ తమ ఉదారతను చాటుకుంటున్నారే తప్ప పంచాయతీకి ఆదాయ మార్గంగా మలచడంలో మాత్రం శ్రద్ధ చూపకపోవడం గమనార్హం.

**:10 ఏళ్లుగా ధరావతుతోనే దారాళంగా..!**

కుంట ముఖద్వారానికి ఎడమవైపున్న 5 పంచాయతీ గదుల సముదాయానికి నిర్మాణ సమయంలో (2005లో వేలం పాటలో దక్కించుకున్న అయిదుగురు వేలంపాట దారులు ఒక్కో గదికి రూ. 3.70 లక్షల నుంచి రూ. 4.20లక్షలవరకు ఏక మొత్తంలో చెల్లించి ఏడాదికి రూ. వెయ్యి వంతున ప్రతి ఏటా 30 శాతం పెంపుతో అద్దెకు దక్కించుకున్నారు. తమకు 20 ఏళ్ల కాలపరిమితి అనే నిబంధన విధించారు కాబట్టి ఆ మేరకు ఒప్పందం కుదిరితేనే రూ. వెయ్యి అద్దె, 30 శాతం పెంపు అనే నిబంధనకు అంగీకరిస్తామని మెలికపెట్టి పంచాయతీకి 10 ఏళ్లుగా ఒక్క రూపాయి కూడా అద్దె చెల్లించడం లేదు. ఆ లెక్కన ఈ అయిదు గదులకు కనీసం రూ. 8 వేలు వంతున లెక్కేసినా ఇప్పటి వరకు రూ. 48 లక్షల ఆదాయం పంచాయతీకి దక్కేది.

**:ఎదురు గదులకు వేలం వేస్తేనే వీటికి వేలం వేయండి..!**

కుంట ముఖద్వారానికి కుడివైపున్న 5 అద్దెగదులకు గతేడాది మార్చితో మూడేళ్ల గడువు ముగిసింది. దీంతో పంచాయతీ అధికారులు తిరిగి వేలం వేయడానికి పూనుకోగా కొందరు పాలకవర్గం సభ్యులు కుంట ముఖద్వారానికి ఎడమవైపున్న గదులకు వేలం నిర్వహిస్తేనే వీటికి వేలం నిర్వహించాలని, లేకుంటే వీలు లేదని పట్టుపట్టారు.ఫలితంగా ఏడాదిగా ఈ అయిదు గదుల్లో ఒక గదికి మాత్రమే అద్దె వస్తుండగా 4 గదులకు అద్దె రావడమే లేదు. ఈ 4 గదులకు ఏడాదిగా రావాల్సిన దాదాపు రూ.7.20 లక్షలు అనుభవదారులు చెల్లిస్తున్నా పంచాయతీకి చేరకపోవడం విశేషం.

అద్దె వసూళ్లలో రాజకీయ జోక్యం చేసుకోవడంతో పెద్ద ఎత్తున నిధులు దారి మల్లుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. కొత్తగా వేలం లేకపోవడం, వాణిజ్య భవనం వినియోగంలోకి రాకపోవడంతో భారీగా పంచాయతీ ఆదాయాన్ని కోల్పోవాల్సి వస్తోంది. అద్దె గదుల వేలం, అద్దెల వసూళ్లు పక్కాగా నిర్వహించి పంచాయతీ ఆదాయాన్ని పెంచి తద్వారా పంచాయతీ అభివృద్ధికి అటు పాలక వర్గం, ఇటు పంచాయతీ అధికారులు పాటుపడాల్సిన అవసరం ఉందని పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.

# గ్రామీణ ఉపాధిలో పారదర్శకతే లక్ష్యం

### అధికారానికి దూరమైన పార్టీలే అపోహలు సృష్టిస్తున్నాయి

### గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

### - మంత్రి సత్యకుమార్ యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్య కుమార్ యాదవ్

**బత్తలపల్లి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**

బత్తలపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన వికసిత్ భారత్-రోజ్ గార్ మరియు అజీవికా మిషన్ గ్రామీణ పథకం (జుతీబి ళితిలీ బి) పై అవగాహన సదస్సు కార్యక్రమంలో జనసేనపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన రెడ్డి తో కలిసి పాల్గొన్న రాష్ట్రఆరోగ్యశాఖమంత్రివర్యులు సత్యకుమార్‌యాదవ్. ఈసందర్భంగా మంత్రిసత్యకుమార్‌యాదవ్ మాట్లాడుతూ గత అనేకసంవత్సరాలుగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంకింద దేశవ్యాప్తంగా పనులు జరుగుతున్న విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. అయితే ఈ పథకం అమలులో క్షేత్రస్థాయిలో జరిగిన అవినీతి, పనుల నాణ్యతలోపం, శాశ్వతఆస్తులు సృష్టించడంలో వైఫల్యం గురించి ప్రజలకు బాగా అవగాహన ఉందని పేర్కొన్నారు. ఎన్ని సంవత్సరాలుగా పనులు జరిగినా, అనేక గ్రామాల్లో శాశ్వతంగా పూర్తైన అభివృద్ధి పనులు కనిపించకపోవడం ఆలోచించాల్సిన అంశమని మంత్రి వ్యాఖ్యానించారు. ఇదే పరిస్థితిని మార్చాలనే ఉద్దేశంతో, గ్రామీణ ఉపాధి పథకాన్ని మరింత పారదర్శకంగా, ఫలితాలిచ్చేలా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ - రోజ్‌గార్ మరియు అజీవికా మిషన్ (గ్రామీణ) పేరిట కొత్త సంస్కరణలను తీసుకువస్తోందని తెలిపారు. లీబివిళినిబితి పథకానికి పేరు ఎందుకు మార్చారు, ఎందుకు కొత్త విధానం తీసుకొచ్చారు అన్న అంశాలపై కొందరు కావాలనే అపోహలు సృష్టిస్తూ, అసత్య ప్రచారాలు చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి రాజకీయ లబ్ధి పొందాలనే ఉద్దేశంతో కొన్ని పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, వారు ఎవరో ప్రజలందరికీ తెలుసునని విమర్శించారు. దేశ స్వాతంత్రం వచ్చిన తర్వాత దాదాపు 60 సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, ఒకే కుటుంబ పాలనతో దేశాన్ని దోచుకుని, పేదలను పేదరికంలోనే ఉంచిందని మంత్రి విమర్శించారు. గరీబ్ హటావో వంటి నినాదాలు కేవలం మాటలకే పరిమితమయ్యాయని, పేదలకు, మధ్యతరగతి వర్గాలకు వాస్తవంగా చేసింది ఏమీ లేదని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ గారు అత్యంత చిత్తశుద్ధితో దేశ ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని అన్నారు. ఉపాధి కేవలం తాత్కాలికంగా కాకుండా, స్థిరమైన జీవికగా మారాలన్నదే ప్రధాని ఆలోచన అని వివరించారు. జుతీబి ళితిలీ బి పథకం ద్వారా గ్రామీణ ప్రజలకు ఉపాధి అవకాశాలు విస్తరించడం, కూలీ పనులతో పాటు జీవిక ఆధారిత ఉపాధి ప్రోత్సాహం, నైపుణ్యాభివృద్ధికి అవకాశం, శాశ్వత ఆస్తుల సృష్టి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం వంటి ప్రయోజనాలు దేశ ప్రజలకు చేకూరుతాయని మంత్రి వివరించారు. దేశాన్ని వికసిత్ భారత్ గా తీర్చిదిద్దాలంటే గ్రామాల అభివృద్ధే పునాది అని ప్రధాని నరేంద్ర మోదీ గారు నమ్ముతున్నారని, అందుకే ప్రతి పథకాన్ని ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరే విధంగా మారుస్తున్నారని మంత్రి అన్నారు. ప్రజలు అసత్య ప్రచారాలను నమ్మకుండా, కేంద్ర ప్రభుత్వ పథకాల నిజస్వరూపాన్ని అర్థం చేసుకుని, అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కావాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కోటి సుధా, పిడి డ్వామా విజయ ప్రసాద్, ఎంపీడీవో నరసింహనాయుడు, బిజెపి మండల అధ్యక్షులు భాస్కర్, ఆకులేటి వీరనారప్ప, టిడిపి మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అయ్యప్ప, వెంకటేశ్వర్లు చౌదరి, వెంకటేశ్వర రెడ్డి, డి. చెర్లోపల్లి నారాయణస్వామి, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతత

## ఎమ్మెల్యే పిఎ బాలాజీ

హిందూపురం ఫిబ్రవరి 6 ప్రభాతవార్త


హాజరైన ఎమ్మెల్యే పిఏ తదితరులు

భగవంతుని సేవలో లీనమై ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ పేర్కొన్నారు. పట్టణం లో బాపూజీ నగర్ నందు నూతనంగా నిర్మించుచున్న శ్రీ ధర్మశాస్త అయ్యప్ప స్వామి సన్నిధానంకు శుక్రవారం స్లాబ్ వేసే కార్యక్రమం జరిగింది. దేవాలయం కమిటీ ప్రతినిధి, జనసేన మండల అధ్యక్షులు చక్రవర్తి తదితరుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పి ఏ బాలాజీ తో పాటు జనసేన ఇంచార్జి ఆకుల ఉమేష్, తెలుగుయువత నియోజకవర్గ ఉపాధ్యక్షులు పవన్ కుమార్, తెలుగు యువత పట్టణ అధ్యక్షులు భార్గవ్, బాపూజీ నగర్ గ్రామ పెద్దలు, పకీరప్ప, మోహన్ బాబు, ఆంజనేయులు, సుమోశీన, సన్నీదాన కమిటీ సభ్యులు కుమార్ దేవాలయానికి సహకరించిన దాతలు, బాపూజీనగర్ వాస్తవ్యులు వెంకటేషులు చిన్న ఆంజనేయులు (బజ్జి) సుధాకర్, వెంకటేష్ సన్నీ, వెంకటేష్, శ్రీనివాసులు, విమల్, హనుమంతు, రామాంజి, ప్రవీణ్, శివ, నాని, శంకర పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థి ఆత్మహత్యాయత్నం

బెలుగుప్ప, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

పదవ తరగతి విద్యార్థి క్రిమిసంహారకమందు సేవించి ఆత్మహత్య ప్రయత్నించిన సంఘటన మండల పరిధిలోని గుండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం చోటుచేసుకుంది ఉపాధ్యాయులు తెలిపిన వివరాలు మేరకు రాయదుర్గం మండలం కాశీపురం గ్రామానికి చెందిన బాలాజీ గుండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు అకస్మాత్తుగా బడిలోనే స్పృహ తప్పిపోవడంతో పోవడంతో వెంటనే ఉపాధ్యాయులు గమనించి అక్కడే ఆర్ఎంపి వైద్యుడు దగ్గరికి తీసుకెళ్లగా ఉదయాన్నే క్రిమ సంహారమందు సేవించాడని వైద్యులు తెలిపారు మెరుగైన వైద్యం కోసం హుటాహుటిన కళ్యాణ దుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు త్వరలోనే జరిగే పదవ తరగతి పరీక్షలు ఉండడంతో పరీక్షలు ఎలా రాయాలని భయంతో భయంతో ఇలాంటి అగత్యానికి పాల్పడ్డాడా లేక వేరే కారణాలు ఏమైనా ఉండాలని తెలియాల్సి ఉంది

# అభివృద్ధి పథంలో కళ్యాణదుర్గం మున్సిపాలిటీ

## 6వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త


సిసి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు గారి ఆదేశాల మేరకు శుక్రవారం మున్సిపాలిటీ 6వ వార్డులో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి తలారి గౌతమి సోమశేఖర్ సంప్రదాయబద్ధంగా భూమి పూజ నిర్వహించి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని, వార్డుల వారీగా మౌలిక వసతుల కల్పనకు తొలి ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పట్టణ అధ్యక్షులు మాదినేని మురళి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కోనంకి రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ హనుమంతరెడ్డి, ఎం.కిష్టప్ప, కోనంకి అమరబిందు, గొర్ల గోవింద్, తలారి సత్తి, పాపన్న, శ్రీనివాసులు, ఎన్.నరసింహారాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే వార్డు నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బోర్ యాజమాన్యం అలసత్వం వ్యక్తి మృతి

బ్రహ్మసముద్రం ఫిబ్రవరి 6 ప్రభాతవార్త


మృతిచెందిన అజ్జప్ప దృశ్యం


పోలీసుల అదుపులో శివగంగా బోర్

మండలంలోని బైరసముద్రం గ్రామంలో పెను విషాదం నెలకొంది రాత్రి 12 గంటల సమయంలో ఒక రైతు తన పొలంలోనే శివగంగ బోరు డ్రిల్లింగ్ చేయిస్తుండగా అక్కడే నిలబడి చూస్తున్నటువంటి అంజప్ప 45 అనే రైతు బోర్ డ్రిల్ ఆపరేటర్లు పైపు మారుస్తున్న సమయంలో అంజప్ప అనే రైతు బోరు పాయింట్ దగ్గరకు వెళ్లి చూస్తుండగా డ్రిల్లింగ్ కు మారుస్తున్న పైపు అంజప్ప అనే రైతు మీద పడడంతో అంజప్ప అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది దీనికి సంబంధించిన సమాచారాన్ని సేకరించిన పోలీసు అధికారులు విచారణ నిమిత్తం శివగంగా బోర్వెల్ ను పోలీస్ స్టేషన్ కు తరలించి విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. అలసత్వం వహించిన శివగంగా బోర్ వెల్స్ యాజమాన్యంపై పోలీసులు చర్యలు తీసుకుంటారా వేచి చూడాలి.

# ఆధునిక పరికరాలుతో... నీటి ఆదా...!

ధర్మవరం రూరల్ ఫిబ్రవరి 6 ప్రభాతవార్త


అరటి పంటలో నీటి ఆదాను పరిశీలిస్తున్న హార్టికల్చర్ ఓఎస్‌డీ రవికుమార్

ఆధునిక పరికరాలతో నీటిని ఆదా చేస్తూ బిందు సేద్యం ద్వారా తక్కువ నీటితో రైతు అధిక దిగుబడులు సాధించవచ్చని హార్టికల్చర్ ఓఎస్‌డీ రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జిల్లా ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుదర్శన్ తో కలిసి ధర్మవరం డివిజన్ పరిధిలో క్షేత్రస్థాయిలో అమలవుతున్న పథకాలను ఆయన పరిశీలించారు. ధర్మవరం మండల డివిజన్ పరిధిలోని నిమ్మలకుంట పోతులనాగేపల్లి చెన్నేకొత్తపల్లి కనుముక్కల గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న పంట పొలాలను అధికారులు సందర్శించారు. ప్రభుత్వం రాయితీపై అందజేసిన డ్రిప్ మరియు స్ప్రింక్లర్ పరికరాలను పొలాల్లో అమర్చిన విధానాన్ని, వాటి పనితీరును స్వయంగా తనిఖీ చేశారు. డ్రిప్ కంపెనీలు రైతులకు అందిస్తున్న సాంకేతిక సహకారం మరియు అమ్మకాల తదుపరి సేవల గురించి రైతులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఓఎస్‌డీ రైతులతో మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయంలో ఖిఆటోమేషన్ఖి ప్రాధాన్యతను వివరించారు. స్మార్ట్ ఇరిగేషన్ పద్ధతుల ద్వారా శ్రమ తగ్గడమే కాకుండా, ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకోవచ్చని సూచించారు. డ్రిప్పు కంపెనీల ప్రతినిధులు రైతులకు నిరంతరం అందుబాటులో ఉండి సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. రైతులకు రాయితీలు మరియు పరికరాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీ సిబ్బంది, హార్టికల్చర్ అధికారులు రైతులు పాల్గొన్నారు.

# కమనీయం శ్రీవారి కళ్యాణం

## భారీగా తరలివచ్చిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో దేవేరులతో శ్రీవారు

హిందూపురం టౌన్ ఫిబ్రవరి 6 ప్రభాతవార్త







కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం శుక్రవారం కన్నుల పండుగ గా జరిగింది. పట్టణంలోని శ్రీ బాలాజీ నగర్ లో వెలసిన భూనీలా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం 22వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక వేడుకలు జరుగుతున్నాయి. శ్రీదేవి, భూదేవి, శ్రీవారి మూలవిరాట్ లు విశేష పుష్పాలంకరణ లో కొలువుదీరారు. ప్రత్యేక అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. ముత్యాల పందిరిలో, సుగంధ పుష్పాల తో ఆరుబయట ఆవరణ లో ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై సునీల్ శర్మ స్వామి బృందం ఆధ్వర్యంలో స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు విశేష కళ్యాణ కైంకర్యాలు నిర్వహించారు. పదకవితా పితామహుడు అన్నమయ్య రచించిన పాటలకు భక్తులు నృత్యం చేస్తూ గోవిందా నామస్మరణతో హోరెత్తించారు. మంగళ వాయిద్యాల మధ్య కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి అనంతరం భక్తులకు చేశారు. ఆలయ నిర్వాహకులు సుబ్రహ్మణ్యం, ప్రసాద్, ఆంజనేయులు, ప్రకాష్, నామా రవి తదితరుల నేతృత్వంలో కార్యక్రమం విజయవంతంగా జరిగింది. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ఇద్దరు ముద్దాయిల అరెస్టు

డి.హిరెహాళ్ ఫిబ్రవరి 6 ప్రభాతవార్త


ముద్దాయిలను అరెస్టు చూపుతున్న ఎస్ ఐ గురుప్రసాద్ రెడ్డి

రైతుల పొలాల్లో విద్యుత్తు మోటార్లకు సంబంధించిన కేబుల్ వైర్లను దొంగతనం చేసిన కేసులో శుక్రవారం ఇద్దరు ముద్దాయిలను అరెస్టు చేసి కోర్టుకు పంపినట్లు ఎస్ ఐ గురుప్రసాద్ రెడ్డి తెలిపారు. ఎస్ ఐ అందించిన వివరాల మేరకు డి.హిరెహాళ్ మండల పరిధిలోని సిద్దాపురం, డి.హిరెహాళ్ గ్రామాల రైతులకు చెందిన పొలాల్లో గత నాలుగు రోజుల క్రితం కేబుల్ వైర్లను దొంగలించిన కేసులో శుక్రవారం మండల పరిధిలోని ఓబులాపురం చెక్ పోస్ట్ వద్ద బళ్ళారి జిల్లా గూడానగర్ కు చెందిన శీను, పరుశురాం లను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన చెప్పారు. అరెస్టు చేసిన ఇద్దరు ముద్దాయిల నుండి సుమారు రూ. 50 వేలు విలువ చేసే కేబుల్ వైర్లను, ఒక మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై వివరించారు.

# శ్రీ మంజునాథస్వామికి ఘనంగా హోమాలు, ప్రత్యేక పూజలు

బెలుగుప్ప, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త




శ్రీ మంజునాథ స్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీ మంజునాథ స్వామికి హోమాలు ప్రత్యేక పూజలు సాయంత్రం శివ భక్తులు అగ్నిగుండ ప్రవేశం మండల కేంద్రంలోని స్థానిక శ్రీ మంజునాథ దేవాలయంలో ధ్వజస్తంభ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం ఉదయం శ్రీ మంజునాథ స్వామి ప్రత్యేకంగా అలంకరించి గణపతి పూజ పుణ్య రుద్రాభిషేకం పాలాభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పురోహితులు చిరంజీవి నాగరాజు ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళలు పురుషులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కలు తీర్చుకున్నారు. వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం శివమాలధార స్వాములు అగ్నిగుండ ప్రవేశం చేస్తూ భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి గ్రామ ప్రజలు మహిళలు పెద్దఎత్తునపాల్గొని అగ్నిగుండప్రవేశాన్ని తిలకించారు రాత్రిభజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీసభ్యులు, గ్రామపెద్దలు తెలిపారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భవతులకు అన్నదానం

లేపాక్షి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త


గర్భవతులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

లేపాక్షి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం 75 మంది గర్భవతులకు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్, రమామణి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు కరణం రామానందన్ పౌష్టికాహారం అందజేశారు. ఉదయం పిహెచ్‌సి వైద్యాధికారి వెంకటచిరంజీవి గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి పలు సూచనలు సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా మాతృమూర్తులకు మధ్యాహ్న భోజనాన్ని కరణం రామానందన్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండేళ్లుగా మాతృమూర్తులకు పౌష్టికాహారం అందజేస్తున్నామని పేర్కొన్నారు. తన జీవితకాలం పౌష్టికాహారం అందచేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ సుబ్రహ్మణ్యం, సిహెచ్ఓ సీతామహాలక్ష్మి, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసత్యమ్మదేవికి జ్యోతుల ఉత్సవం

లేపాక్షి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త


సత్యమ్మదేవి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న వైకాపా నేత వేణురెడ్డి

మండల పరిధిలోని పి.కొత్తపల్లి గ్రామంలో వెలసిన శ్రీసత్యమ్మదేవికి శుక్రవారం మహిళలు ఉపవాస దీక్షతో జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. గ్రామ దేవత సత్యమ్మదేవికి శుక్రవారం ఉదయం నుండి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉపవాస దీక్షతో మహిళలు జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించి అమ్మవారికి అర్పించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నేత వేణురెడ్డి, నాయకులు ద్వారకానాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, నారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, రామిరెడ్డి, శివారెడ్డి, హరినాథ్‌రెడ్డి, బాలాజీరెడ్డి, నవీన్, హరి, పాల్గొన్నారు.

# మంత్రిని వివాహ కార్యక్రమంకు ఆహ్వానం

డి.హిరెహాళ్ ఫిబ్రవరి 6 ప్రభాతవార్త


మంత్రి సత్యప్రసాద్ యాదవ్‌ను వివాహ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్న బండి క్రిష్టప్ప

రాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు నాయకుల బండి క్రిష్టప్ప తన కుమారుడు నరేంద్ర వివాహ కార్యక్రమంకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య ప్రసాద్ యాదవ్ ను ఆహ్వానించారు. శుక్రవారం వాల్మీకి సంఘం అధ్యక్షులు బండి ఆ సేవాసమితి ఉపాధ్యక్షులు మలకన్న, ఉప కార్యదర్శి నాగలాపురం నారాయణస్వామి, న్యాయసలహాదారులు న్యాయవాది రవిచంద్ర సభ్యులతో కలిసి ఆయన ధర్మవరంపట్టణంలోని ఎన్డీఏకార్యాలయంలో మంత్రిని కలుసుకొని సన్మానించి వివాహ ఆహ్వాన పత్రిక అందజేసి రాయదుర్గం పట్టణం మార్కెట్‌యార్డ్‌లో జరుగనున్న తన కుమారుడి వివాహానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వాల్మీకి సంఘం అధ్యక్షుడు బండిని మర్యాదపూర్యకంగ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ సేవా సమితి మీడియా సలహాదారులు బోయపాటి ప్రకాష్, పొగాకు రామచంద్ర, పెనుగొండ ఈశ్వరయ్య, విశ్రాంతి ఉద్యోగి రామాంజనేయప్రసాద్, వాల్మీకి యువ నాయకులు హరీష్, ముత్తయ్య, మిత్రులు విశ్రాంతి ఉద్యోగి గొల్ల గోపాల్, గోల్డ్ విజ్జి, గాజుల భీమరాజు పాల్గొన్నారు.

# రైతులకు అందుబాటులో కిసాన్ డ్రోన్ - జెడిఏ రవి

గుత్తి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త


జెడిఏ మాట్లాడుతున్న దృశ్యం

కిసాన్ డ్రోన్ ఉబరైజేషన్ కార్యక్రమం మేరకు రైతులకు డ్రోన్లు అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ జెడిఏ రవి పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఏడిఏ వెంకటరాముడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిసాన్ డ్రోన్ యాప్‌ను రైతులు సెల్‌ఫోన్‌లో డౌన్‌లౌడ్ చేసుకోవాలన్నారు. తదుపరి అవసరమైన రైతులు మందుల పిచికారీ కోసం పేరు నమోదు చేసుకుంటే నేరుగా అయితే రైతు పొలం వద్దకు వచ్చి సేవలు అందిస్తారని ఆయన వివరించారు. అనంతరం పారిశ్రామికవాడలో ఉన్న పురుగుమందుల ఫ్యాక్టరీని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఏఒ శశికళ, స్థానిక ఏఒ ముస్తాక్‌అహ్మద్, డివిజన్ పరిధిలోని వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

# ఇంటింటి ఫ్యామిలీ సర్వే త్వరితగతిన పూర్తి చేయండి

## - మండలంలో పర్యటించిన...జిల్లా పంచాయతీ అధికారి సమత


సర్వే తీరును అడిగి తెలుసుకుంటున్న జిల్లా అధికారి

గోరంట్ల, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

మండల వ్యాప్తంగా జరుగుతున్న యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే నిర్వహణలో వేగం పెంచాలని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి సమత సిబ్బందికి సూచించారు. మండల పర్యటనలో భాగంగా శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి సమతతో పాటు మండల ఎంపిడిఒ కమలాబాయి మండలంలోని పలు గ్రామాలలో జరుగుతున్న సర్వే తీరును పరిశీలించారు. ఇందులో భాగంగా మండలంలోని గోరంట్ల, మల్లాపల్లి, మందలపల్లి గ్రామాల్లో జరుగుతున్న అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంతమంది విద్యను అభ్యసిస్తున్నారని వారు అభ్యాసకులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# జమ్మల బండ గ్రామంలో రేషన్ షాప్ తనిఖీ చేసిన స్పెషల్ ఆఫీసర్

గుడిబండ ఫిబ్రవరి 6 ప్రభాతవార్త


ప్రజలతో వివరాలు సేకరిస్తున్న అధికారులు

మండల పరిధిలోని జమ్మలబండ గ్రామంలో కేంద్ర బృందం స్పెషల్ ఆఫీసర్ రామాంజనేయులు ,సీఎస్‌డీటీ నవీన్, తహశీల్దారు శ్రీధర్ రేషన్ షాపును తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వారు రేషన్ సరుకుల నిల్వలు, పంపిణీ విధానం, తూకం సక్రమంగా జరుగుతోందా లేదా అనే అంశాలను ప్రజల ఇంటి వద్దకే వెళ్లి ఆరా తీశారు. అలాగే రేషన్ షాప్ ద్వారా లబ్ధిదారులకు అందుతున్న సేవలపై గ్రామ ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ నిర్వహించారు. రేషన్ సరుకులు సమయానికి అందుతున్నాయా,ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయా అనే విషయాలపై లబ్ధిదారులను ప్రశ్నించారు.ప్రజలు తెలిపిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార చర్యలు చేపడతామని స్పెషల్ ఆఫీసర్ హామీ ఇచ్చారు. భవిష్యత్తులో రేషన్ పంపిణీ ప్రక్రియ మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ మల్లికార్జున,విఆర్ఏ నింగప్ప, డీలర్లు పాల్గొన్నారు.

# క్రమశిక్షణ కలిగి కష్టపడి చదివితే విజయం మీ సొంతం

-అనంతపురం జిల్లా విద్యాధికారి ప్రసాద్‌బాబు

-ఎస్.కె.ప్రభుత్వ ఉన్నత పాఠశాల సందర్శన

-గణిత ఎస్ఏ చంద్రశేఖర్‌కు ఘన సన్మానం


కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి ప్రసాద్‌బాబు

ఉరవకొండ, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండి కష్టపడి చదివితే విజయం మీ సొంతమవుతుందని అనంతపురం జిల్లా విద్యాధికారి ప్రసాద్‌బాబు అన్నారు. ఉరవకొండ పట్టణంలోని ఎస్.కె.ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణితం పాఠశాల సహాయకుడిగా పనిచేస్తున్న చంద్రశేఖర్ సౌత్ ఇండియా సైన్సు ఫెయిర్-2026లో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ కేటగిరిలో ప్రథమ స్థానంలో నిలిచిన


గణితం పాఠశాల సహాయకుడు చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న డీఈవో ప్రసాద్‌బాబు తదితరులు

సందర్భంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ సంస్థానం కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం పాఠశాలలో అట్టహాసంగా జరుగగా ఆయన విశిష్ట అతిథిగా, విశ్రాంత డిప్యూటీ డీఈవో మల్లారెడ్డి, యుపీఎస్ సీఐ మహానంది, ఎంపీడీవో రవిప్రసాద్, ఎంఈవోలు ఈశ్వరప్ప, రమాదేవి, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ షాషావలి, ఎస్ఎంసీ ఛైర్మెన్ గోపాల్ ముఖ్య అతిథులుగా హాజరై ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌ను షాలువాకప్పి పూలమాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డీఈవో ప్రసాద్‌బాబు మాట్లాడుతూ విద్య అనేది జీవితంలో విజయం సాధించడంలో ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల రెక్కల కష్టాన్ని గుర్తించి వారి ఆశయాలకు అనుగుణంగా బాగా చదువుకొని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఎస్.కె.ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎంతో చరిత్ర ఉందని ఇక్కడ చదువుకున్నవారు నేడు ఎన్నో ఉన్నతమైన స్థానాల్లో ఉన్నారన్నారు. 10వ తరగతిలో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించి 570 కంటే ఎక్కువ మార్కులు సాధిస్తే తాను వచ్చి ప్రోత్సాహక బహుమతులు అందిస్తానని ప్రకటించారు. గణితం పాఠశాల సహాయకుడు టి.చంద్రశేఖర్ దక్షిణ భారత సైన్సు ఫెయిర్‌లో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ కేటగిరిలో ప్రథమ స్థానంలో నిలవడం ఎంతో గర్వకారణమని ఆయన భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ గణిత పాఠశాల సహాయకులు టి.చంద్రశేఖర్ సాధించిన ఘనతతో పాఠశాల కీర్తి ప్రతిష్ఠలు మరింత పెరిగాయని కొనియాడారు. ఎస్.కె.ఉన్నత పాఠశాలకు జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపుఉందని విద్యార్థులుఅందుకుతగ్గట్టు బాగాచదువుకొనిమంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలన్నారు. సన్మాన గ్రహిత టి.చంద్రశేఖర్ మాట్లాడుతూ తాను సైన్సుఫెయిర్‌లో విజయంసాధించడానికి హెచ్.ఎం,తోటి ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఎంతోఉందని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# తండ్రి అప్రమత్తతతో తప్పిన బాలుడి కిడ్నాప్..!!

- మహిళకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

- భయాందోళనలో కాలనీవాసులు

గుంతకల్లు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త


బాలుడిని కిడ్నాప్‌కు యత్నించిన మహిళ


కిడ్నాప్ నుండి తప్పించుకున్న బాలుడు విఘ్నేష్

పట్టణ శివారులోని గుత్తి రోడ్డు బాబు జగ్జీవన్‌రామ్ కాలనీలో తండ్రి అప్రమత్తతతో ఓ బాలుడు కిడ్నాప్ నుండి తృటిలోలో తప్పించుకున్నాడు. వివరాలు ఇలా వున్నాయి. కాలనీకి చెందిన శ్రీనివాసులు, సుజాతల రెండవ కుమారుడు ఐదేళ్ల విఘ్నేష్ శుక్రవారం మధ్యాహ్నం ఇంటిముందు ఆడుకుంటున్నాడు. అప్పటికే అక్కడ కాపు కాచిన గుర్తుతెలియని మహిళ బాలుడికి చాక్లెట్ల ఆశ చూపి కిడ్నాప్‌కు యత్నించింది. బాలుడు గట్టిగా అరవడంతో మొదటి కుమారుడు ఇంట్లో నిద్రిస్తున్న తండ్రికి విషయం చెప్పాడు. అప్రమత్తమైన అతను కాలనీవాసుల సహకారంతో మహిళను పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించాడు. కాలనీవాసులు గట్టిగా మందలించడంతో తాము ఆరుగురం వచ్చామని మహిళ చెప్పినట్లు తెలిసింది. ఉదయం ఇళ్లిళ్ళూ తిరుగుతూ భిక్షాటన చేస్తామని పేర్కొంది. మధ్యాహ్నం ఎవరు లేని సమయంలో ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నట్లు తెలిపింది. రూరల్ పోలీస్‌స్టేషన్‌కు అర కిలోమీటర్ దూరంలో మిట్ట మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. దీంతో కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. ఇక్కడ ఎక్కువ శాతం కూలి పనులకు వెళ్లే వారు ఉండడంతో కాలనీని టార్గెట్ చేసినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా మహిళను స్టేషన్‌కు తీసుకెళ్లిన అరగంటలోపే తాను ఆమె భర్త అని ఓ వ్యక్తి పోలీసుల ఎదుట లొంగిపోయాడు. అయితే అతను ఎక్కడినుండి వచ్చాడు..? అరగంటలోపే సమాచారం ఎలా అందింది అన్నది ప్రశ్న. వీరంతా ఓ ముఠాగా ఉన్నారా వారే సమాచారం చేరవేశారా అని కాలనీవాసులు చర్చించుకుంటున్నారు. కిడ్నాప్‌కు యత్నించిన మహిళ రమణమ్మగా ఆమె భర్త మల్లేష్‌గా పోలీసులు నిర్ధారించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని తెలుసుకుంటున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

# ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు థర్డ్ స్పెల్ ప్రారంభం..

కొత్తచెరువు ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పబ్లిక్ ప్రాక్టికల్ పరీక్షలు థర్డ్ స్పెల్ జనరల్ మరియు ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయని డి ఐ ఈ ఓ చెన్నకేశవ ప్రసాద్ తెలిపారు ఉదయం జరిగిన ప్రాక్టికల్ పరీక్షలకి 1437 మందికి గా ను 48 మంది విద్యార్థులు గైరహాజరయ్యారు అలాగే మధ్యాహ్నం జరిగిన ప్రాక్టికల్ పరీక్షలు 1167 మంది విద్యార్థులకు గాను 35 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను డిఇసి సభ్యులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పరిశీలించారు.

## పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ

శింగనమల, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త



పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

గత ప్రభుత్వ హయాంలో పట్టాదారు పాసుపుస్తకాలపై పార్టీ రంగు, ఫోటోలు వేశారని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. ఆమె శుక్రవా రం మండల పరిధిలోని చెన్నవరం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రాజముద్రతో ము ద్రించిన కొత్తపట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రీ సర్వే పూర్తి అయిన గ్రామాల్లో కొత్తపట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని, తప్పులను సరిదిద్ది భూ వివాదాలు లేకుండా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు శేషారెడ్డి, రాష్ట్ర పంచాయితీ కార్యనిర్వ హక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి, టిడిపి మండల కన్వీనర్ గోరంట్ల మారుతి నాయుడు, మాజీ జడ్పిటిసి శాలిని, మాజీ మండల కన్వీనర్ చితంబరదొర, టిఎన్ఎస్ఎఫ్ బండి పరుశురామ్, ఆకులేడు రామచంద్ర, మల్లీ, పట్నం నగేష్, వీరనారప్ప, మాసుల్ చంద్రమోహన్, బండి బాలరాజు, నల్లప్ప, శ్రీనివాసులునాయక్, ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫారం పాండ్ల నిర్మాణానికి ప్రభుత్వ రాయితీ
### - జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి



ఫారం పాంపడ్లను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారులు



చీనీ తోటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

శింగనమల, ఫిబ్రవరి 06 ప్రభాతవార్త

సాగునీటి వసతిగల రైతులకు వర్షపు నీటిని నిల్వ చేసుకుని, వేసవి కాలంలో నీటి ఎద్దడి నుంచి పండ్ల తోటలను సంరక్షించుకోవడానికి మినీ ఫారం పాండ్లు ఉపయోగపడుతాయని ఫారం పాండ్ల నిర్మాణానికి ప్రభుత్వం రాయితీ కూడా అందిస్తున్నట్లు జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఈస్ట్ నర్సాపురం, నాయినవారిపల్లి తరిమెల గ్రామాల్లో 2025, 26 ఆర్థిక సంవత్సరంలో ఉద్యాన శాఖ ద్వారా మంజూరైన వ్యక్తిగత ఫారం పాండ్ల నిర్మాణాలను, నీటి కుంటలను మండల ఉద్యానశాఖ అధికారి శైలజాతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో చీనీ పంటలో చేపట్టాల్సిన సాంకేతిక యాజమాన్య పద్దతులు, పూత, పిందె సమయంలో చేపట్టవలసిన పద్దతులపైన అదే విధంగా తెగులు నివారణపైన రైతులకు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా సిబ్బంది మునికుమార్, చంద్రకళ, జయంతి, నాగేశ తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాలలో ప్రాంగణనియామక ప్రక్రియ

కదిరి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త



ఉద్యోగులకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్, కంపెనీ ప్రతినిధులు

పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ఇండిగ్రిడ్ కంపెనీ వారిచే ప్రాంగణ నియామక ప్రక్రియ నిర్వహించారు. ఇందులో విద్యార్థులకు రాత పరీక్ష, మౌఖిక పరీక్ష నిర్వహించారు. కళాశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు కదిరి ప్రాంతంలోని నంబులపూలకుంట సమీపంలోని బెనిగల్లు సోలార్ 100 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి పనులు జరుగుతున్నాయని, ఈ ప్లాంటులో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. రాత పరీక్షలో 14 మంది హాజరయ్యారని, ఇందులో 9 మంది మౌఖిక పరీక్షకు హాజరు కాగా వారిలో ముగ్గురు విద్యార్థులను కంపెనీ ప్రతినిధులు ఎంపిక చేసుకున్నారన్నారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం 3 లక్షలన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

## రైతులకు పాస్‌పుస్తకాలు పంపిణీ

కదిరి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త



రైతులకు పాస్‌పుస్తకాలు అందజేస్తున్న జెసి మౌర్య భరద్వాజ్

కదిరి రూరల్ మండలంలోని మోటుకుపల్లి గ్రామంలో శుక్రవారం మీ భూమి-మీహక్కు కార్యక్ర మంలో భాగంగా రాజ ముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ చేతులు మీదుగా రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం పంపిణీ చేసిన నూతన పాసుపుస్తకాలతో రెవెన్యూ సమస్యలకు చెక్‌పడుతుందని రాజముద్రతోపాటు క్యూఆర్ కోడ్ వంటి భద్రతో కూడిన పాస్‌పుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పాస్‌పుస్తకాల్లో పేరు, విస్తీర్ణం, సర్వే నెంబర్లలో ఎలాంటి తప్పులు ఉన్నా కూడా వెంటనే మా దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ వివిఎస్ శర్మ, తహశీల్దారు రెడ్డి శేషకర్, విఆర్ఓ తదితరులు పాల్గొన్నారు.

## విబిజి-రామ్-జీ చట్టం రద్దు చేసి పాత ఉపాధి హామీ చట్టం కొనసాగించాలి
### - 9న ఏపీవో కార్యాలయాల ముందు ధర్నాలు
### - వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉప కార్యదర్శి రమణ



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

నంబులపూలకుంట, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

ఉపాధి కూలీలకు తీవ్ర నష్టం కలిగించే విబిజి- రామ్-జీ చట్టాన్ని వెంటనే రద్దు చేసి, పాత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని సిపిఐ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన మండలాల్లోని ఏపీవో కార్యాలయాల ముందు నిర్వహించే ధర్నాలను ఉపాధి కూలీలు, పేదలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఉప కార్యదర్శి రమణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో కరపత్రాలు పంపిణీ చేసి, విబిజి- రాంజీ చట్టం అమలులోకి వస్తే గ్రామీణ కూలీలకు కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. గ్రామీణ భారతంలో కష్టజీవుల జీవనాధారంగా నిలిచిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం క్రమంగా నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ఉపాధి హామీలో పనిచేసే క్షేత్రస్థాయి సిబ్బందిపై రాజకీయ వేధింపులు ఆపాలని, రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసి వ్యవసాయ కార్మిక సంఘాల ప్రతినిధులను అందులో చేర్చాలని రమణ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సూర్యనారాయణ రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి రాజారెడ్డి, ఉప కార్యదర్శి లాలు సాబ్, గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.

## డ్వామా కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాను జయప్రదం చేయండి
### సిపిఐ నియోజకవర్గం కార్యదర్శి టి.నారాయణస్వామి

బుక్కరాయసముద్రం ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

గ్రామీణ ఉపాధి హామీ పై వికసిత దాడికి వ్యతిరేకంగా ఈ నెల 9న జిల్లా డ్వామా పిడి ఆఫీసు ఎదుట చేపట్టిన ధర్నాను జయప్రధం చేయాలని సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి రాజారెడ్డి, శింగనమల నియోజకవర్గం కార్యదర్శి నారాయణస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం సిపిఐ నియోజకవర్గం సమావేశం అనంతపురం సీపీఐ జిల్లా కార్యాలయంలో రాము అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్బంగ వారు మాట్లడుతూ కేంద్రం 90శాతం, రాష్ట్రం 10 శాతం ఉపాధి హామీ పథకానికి నిధులు యధావిధిగా కేటాయించాలని విబిజీ-రామ్-జీ చట్టాన్ని రద్దు చేయాలి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని ఉపాధి హామీ పథకంలో యంత్రాలను వినియోగించకుండా శ్రామికులతోనే పనులు చేయిం చాలన్నారు .గ్రామీణ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ పథకాన్ని నీరుగార్చాలని ఉద్దేశంతోనే మోడి ప్రభుత్వం కుట్రలు చేస్తుంది. ఇప్పటికే రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపో యింది. ఈ పథకాన్ని నీరుకారుసుంది. వాటిని వ్యతిరేకిస్తు సీపీఐ తోపాటు ప్రజా సంఘాలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు.

గతంలో కేంద్ర ప్రభుత్వం 90శాతం నిధులు ఇస్తే ఈ కొత్తపథక ంలో 60శాతం మాత్రమే ఇవ్వడం జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వ ం 40శాతం



మాట్లడుతున్న నియోజకవర్గం కార్యదర్శి నారాయణస్వామి

నిధులు వెచ్చించాలని ఈ చట్టం రూపకల్పన చేయడమైంది, దానివల్ల ఉపాధి పథకం అనేది పేదలకు కేంద్ర విదానాల వల్ల భారీ నష్టం కలు గుతుంది .పేరుకు 100 రోజుల నుండి 125 రోజులు పెంచి సగటు కూలీ రేట్లు తగ్గించడం అన్యాయ మన్నారు. పాత చట్టం ప్రకారమే వందరోజులకు జాబ్‌కా ర్డుకు రూ,30,700 వచ్చేదని కొత్త చట్టం ప్రకారం 125 రోజులకు అదే మొత్తం ఇవ్వడం జరుగుతుంది. దీనివల్ల నష్టపోతున్న శ్రామికులకు ఏమి న్యాయం చేశారో మోడి ప్రభుత్వం ఆలోచించాలన్నారు. గతంలో పనిముట్లు అందజేసేవారు. ధర్నాకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు నియోజకవర్గం సహాయ కార్యదర్శి చిన్నప్పయాదవ్, మండల కార్యదర్శి రామక్రిష్న, మధుయాదవ్, గంగాధర్, రాముడు, హరిక్రిష్న, రామాంజినేయులు, ఆనంద్, లలిత, చికెన్‌భాషా ,శ్రీనివాసులు, పెద్దపెద్దయ్య, సద్దాం, భాషా, నూర్జాహ దతిత రులు పాల్గొన్నారు.

## అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన గ్రంథాలయ సంస్థ చైర్మన్ వడ్డే వెంకట్

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

జిల్లా గ్రంథాలయ సంస్థలో కొందరు సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని, సమయ పాలన పాటించడం లేదని ఇటీవల పత్రికల్లో వచ్చిన కథనాలపై జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వడ్డే వెంకట్ స్పందించారు. వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమయ పాలనపై కచ్చితంగా పాటించాలని జిల్లాలోని అన్ని శాఖా గ్రంథాలయాలు ఉదయం 8:00 నుండి 11:00 వరకు, సాయంత్రం 4:00 నుండి 7:00 వరకు విధిగా తెరిచి ఉండాలి సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు తీసుకోబడతాయాని అన్నారు. వ్యవస్థలో ఎవరైనా తప్పు చేస్తే ఎంతటి వారినైనా సహించేది లేదు అని ఛైర్మన్ గారు స్పష్టం చేశారు అదేవిధంగా జిల్లాలోని గ్రంథాలయాలకు పుస్తకాలు పంపిణీ చేశారు ఇటీవల రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ అవార్డులు అందుకున్న రామాంజీనమ్మ, జయసిం హారాజు, శ్రీధర్‌లని, ఇటివల ఏపీపీఎస్సీ ద్వారా గ్రూపు 1, గ్రూపు 2 ఉద్యోగాలకు ఎంపికైనా కిరణ్, ఇబ్రహీంలను ఛైర్మెన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు, అలాగే ఉద్యోగసంఘాల జె.ఏ.సి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన క్యాలెండర్ ఛైర్మెన్ వడ్డే వెంకట్, సెక్రెటరీ కమ్మన్న ఆధ్వర్యంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల జె. ఏ. సి నాయకులు ప్రతాపరెడ్డి, శ్రీనివాసులు, జయరాం, రవికుమార్ నాయుడు, రామాంజినేయులు, గోవిందు, శ్రీపతి, బొజ్జ నాయక్, ఖాజా మొద్దీన్, సీనా నాయక్, వివిధ మండ లాల లైబ్రేరియన్లు తదితరులు పాల్గొన్నారు.



సంస్థ చైర్మన్ వడ్డే వెంకట్‌ను సన్మానిస్తున్న దృశ్యం

## ఆర్థిక బకాయిలు చెల్లించి, ఐఆర్ 29 ఇవ్వాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యేకి వినతిపత్రం - యు.టి.ఎఫ్ నేతలు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

యుటిఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు అన్ని జిల్లాల్లో విజ్ఞాపన పత్రాలు ఇవ్వడంలో భాగంగా ఈరోజు అనంతపురం అర్బన్ నియోజకవర్గ ఎమ్మెల్యే గౌరవ దగ్గుపాటి వెంకటేశ్వ రప్రసాద్‌కి వినతి పత్రంను యూటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కోటేశ్వరప్ప ఆధ్వర్యంలో ఇవ్వడం జరిగింది. ఎమ్మెల్యేకి 12వ పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే వేయాలని, ఐఆర్ 29 ప్రకటించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఆర్థిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అసెంబ్లీలో చర్చించాలని, పరిష్కా రం కొరకు తమ వంతు కృషి చేయాలని ఎమ్మెల్యేకి విన్నవించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు కోటేశ్వరప్ప ,రాష్ట్ర కార్యదర్శి దేవేంద్రమ్మ, జిల్లా కార్యదర్శులు సుబ్బారాయుడు చంద్రమోహన్ రాష్ట్ర కౌన్సిలర్స్ గోవిందరాజులు, లింగమయ్య ఆడిట్ కమిటీ కన్వీనర్ గంగాధర్, సీనియర్ నాయకులు నాగేంద్ర పట్టణ నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

## బిజెపి మైనార్టీ మోర్చ రాష్ట్ర కార్యదర్శిగా మహ్మద్ రఫి నియామకం

అనంతపురం సిటీ, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

భారతీయ జనతాపార్టీ రాష్ట్ర మైనార్టీ మోర్చ రాష్ట్ర కార్యదర్శిగా మహ్మద్ రఫి నియమితులాయ్యారు. ఈ మేరకు మైనార్టీ మోర్చ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్‌బాషా ఉత్తర్వులను విడుదలను చేశారు. అనంతపురం నగరానికి చెందిన మహ్మద్ రఫి గత మూడు దశాబ్దాలుగా బిజెపిలో చురుకైన నేతగా పని చేస్తున్నారు. పార్టీ అభ్యున్నతి కోసం ఆయన చేస్తున్న సేవలను గుర్తించి మైనార్టీ మోర్చ రాష్ట్ర కార్యదర్శిగా పార్టీ అధిష్టానం నియమిఇంచింది. ఈ సందర్భంగా ఆయన మాట్లా డు తూ.. తనపై నమ్మకం ఉం చి రాష్ట్ర మైనార్టీ కమిటీలో అవకాశం కల్పించిన రాష్ట్ర నేతలకు, సహకరించిన జిల్లా నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ బలోపేతం కోసం మరింత సమర్ధవం తంగా పని చేస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.



మైనార్టీ మోర్చ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ రఫి

## ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పిద్దాం - ఎంఈఓ-2 శివ ప్రసాద్

శింగనమల, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

యుటిఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పిద్దాం, ఊరుబడిని కాపాడుదాం అనే గోడపత్రికలను ప్రచార కరపత్రాలను ఎంఈఓ-2 శివ ప్రసాద్ విడుదల చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఆయన పెరవలి హెచ్ఎం హరినాథ్, తరిమెల హెచ్ఎం వరలక్ష్మి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, రాష్ట్ర కౌన్సిలర్ గోవిందరాజులు, ఇతర సంఘాల నాయకులతో కలిసి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2026-27 నూతన అకాడమిక్ సంవత్సరానికి ముందుగానే బడి ఈడు కలిగిన పిల్లలను ప్రభుత్వ పాఠశాల ల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు కృషజ చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచి ప్రభుత్వ బడులను కాపాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ మాట్లాడుతూ ..పిల్లలు ఉంటేనే ప్రభుత్వ బడి ఉంటుందని, ప్రభుత్వ బడులు ఉంటేనే ఉపాధ్యాయులు ఉంటారని, తద్వారా వారి హక్కుల సాధన కోసం సంఘాలు ఉంటాయని, కాబట్టి మన ఊరి బడిని కాపా డుకుం దామని వారు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటసు బ్బయ్య, సూర్య నారాయణ, విష్ణు వర్ధన్‌రెడ్డి, రామమూర్తి, శ్రీనివా సులు, బాల చిన్నారెడ్డి, మధుసూధన్, నాయక్‌బాలు, వెంకటరావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

## లేబర్ కోడ్లు..కార్మికులపై కార్పొరేట్ దాడి
### - ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మెతో గట్టి సమాధానం - ఐక్య కార్మిక సంఘాల పిలుపు

అనంతపురం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త బ్యూరో

కార్మికులను బానిసలుగా మార్చే కేంద్ర ప్రభుత్వ నాలుగు లేబర్ కోడ్లు కార్పొరేట్ దోపిడీకి చట్టబద్ధత కల్పిస్తున్నాయని కేంద్ర కార్మిక సంఘాల నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. శుక్రవారం అనంతపురంలోని ఎన్‌జీవో హోమ్‌లో సిఐటియు, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, వైయస్సార్ ట్రేడ్ యూనియన్, ఏఐసీసీటీయూ ఆధ్వర్యంలో గోడపత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజారెడ్డి, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఏసు రత్నం, వైయస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి, ఏఐసీసీటీయూ నాయకులు వేమన, నగర కార్యదర్శి ముత్తుజ, రైతు సంఘం నాయకులు మల్లికార్జున మాట్లాడుతూ.. స్వాతంత్రం తరువాత పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి యజమానులకు సంపూర్ణ అధికారాలు అప్పగించడం ప్రజాస్వామ్యంపై దాడి అని విమర్శించారు. లేబర్ కోడ్లు అమలైతే సంఘాలు ఏర్పాటు చేయడం, ప్రశ్నించడం, సమ్మెలు-ధర్నాలు చేయడం నేరంగా మారుతుందని, ఫిక్స్ టర్మ్ ఎంప్లాయిమెంట్ పేరుతో కార్మికులను ఎప్పుడైనా తొలగించే దోపిడీకి చట్టబద్ధత కల్పించారని అన్నారు. కావున లేబర్ కోడ్ల రద్దు కోసం ఫిబ్రవరి 12న కేంద్ర కార్మిక సంఘాలు చేపడుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో జిల్లా వ్యాప్తంగా అన్ని రంగాల కార్మికులు, కర్షకులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి ముత్తుజ, ఏఐటియుసి కృష్ణుడు, రాజు, వైయస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు హుస్సేన్ పీరా, అనిల్ కుమార్ గౌడ్, రాజశేఖర్ రెడ్డి, రాజారత్నం, కాకర్ల శ్రీనివాస్ రెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికలు విడుదల చేస్తున్న నాయకులు

## తాడిపత్రి మార్కెట్‌యార్డ్‌కు పూర్వ వైభవం తెస్తాం
### - మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రిఅర్బన్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

తాడిపత్రి మార్కెట్ యార్డ్‌కు పూర్వ వైభవం తీసుకొస్తామని మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మార్కెట్‌యార్డ్‌లో శుక్రవారం యార్డ్ చైర్‌పర్సన్ భూమా నాగరాగిణి అధ్యక్షతన నిమ్మ, చీనీ రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తాడిపత్రి మార్కెట్‌యార్డ్‌లో రైతులు నేరుగా తాము పండించిన నిమ్మ, చీనీ పంటలను మార్కెట్ యార్డుకు తీసుకొచ్చి విక్రయిస్తే తగిన గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. గతంలో మార్కెట్‌యార్డ్‌లో కొంతమంది వల్ల రైతులు ఇబ్బందులు పడ్డారని ఇప్పుడు ఆ సమస్యలు లేకుండా చేస్తామన్నారు. పండించిన పంటలు నేరుగా విక్రయించుకునే విధంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మార్కెట్‌యార్డ్ చైర్‌పర్సన్ భూమా నాగరాగిణి నిమ్మకాయల క్రయ విక్రయాల మండీలను పరిశీలించారు. నిమ్మకాయలు నాణ్యతను బట్టి బస్తా 300 రూపాయల నుంచి 2 వేల రూపాయల వరకు పలుకుతోందన్నారు. వేసవిలో గత ఏడాది నాణ్యత బాగున్న నిమ్మకాయలు బస్తా ధర 8 వేల రూపాయల వరకు విక్రయించడం జరిగిందన్నారు. రైతులు మార్కెట్‌యార్డ్‌కు నిమ్మకాయలు తీసుకొని వచ్చి విక్రయించుకుంటే లాభాలు వస్తాయని పేర్కొన్నారు. మార్కెట్‌యార్డ్‌లో ఉన్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ సెక్రటరీ రంగనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి

## మహర్షి వాల్మీకి సేవాదళ్ జిల్లా అధ్యక్షుడిగా భాను కోట శివ.

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :



భానుకోట శివకు నియ మాక పత్రంఅందజేస్తున్న దృశ్యం.

మహర్షి వాల్మీకి సేవాదళ్ అనంతపురం జిల్లా అధ్యక్షునిగా అనంత రూరల్ మండలం రచన పల్లి పంచాయతీ సిండికేట్ నగర్ కు చెందిన భానుకోట శివ ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి అక్కులప్ప నియమాక పత్రమును అందజేశారు. ఈ సందర్బంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ జిల్లాలోని వాల్మీకి యువతకు, కుటుంబాలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేసి ఆ సమస్యలను పరిష్కరించి జిల్లాలో మహర్షి వాల్మీకి సేవాదళ్ ను మరింత బలోపేతం చేసి సంఘం అభివృద్ధికి కృషి చేయాలని నూతన జిల్లా అధ్యక్షునికి తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు భానుకోట శివ మాట్లాడుతూ మహర్షి వాల్మీకి సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి అక్కులప్ప నా మీద నమ్మకంతో సేవాదళ్ జిల్లా అధ్యక్షునిగా నియమించడం జరిగిందని ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా జిల్లాలో సంఘ అభివృద్ధికి నా వంతు కృషి చేయడంతో పాటు జిల్లాలోని వాల్మీకి యువతకు, వాల్మీకి కుటుంబాలకు నిత్యం అందుబాటులో ఉండి వారు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయడం తో పాటు, ఆ సమస్యలను ఎప్పటికప్పుడు రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకుపోయి ఆ సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా పోరాటం చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగావాల్మీకి (బోయ) లను యస్.టి జాబితాలోనికి పునరుద్ధరణే లక్ష్యంగా పోరాటాలు చేయడం జరుగుతుందన్నారు. నా ఎంపిక సహకరించిన వాల్మీకి సోదరులకు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేయడం జరుగుతుందన్నారు. అనంతరం నూతన అధ్యక్షుని వాల్మీకి సోదరులు పూ ల మాల వేసి శాలువా కప్పి సత్కరించారు.

## శ్రీరాజరాజేశ్వరిదేవికి కుంకుమార్చనలు



శ్రీరాజరాజేశ్వరిదేవి అమ్మవారిని అలంకరించిన దృశ్యం



శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామికి పూజలు చేసిన దృశ్యం

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన పురాతన శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో వెలసిన శ్రీరాజరాజేశ్వరిదేవి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘమాసం పురస్కరించుకుని ఉదయం అర్చకులు శంకరయ్యశర్మ, గిరిశర్మలు అమ్మవారిని వివిధ రకాల పుష్పహారాలతో ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీబుగ్గ రామలింగేశ్వరస్వామికి అర్చకులు మహేష్‌శర్మ, రవిశర్మలు పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక ంగా అలంకరించారు. అదేవిధంగా శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామికి, నవగ్రహాలకు నందుస్వామి, రామకృష్ణశర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చంద్రమోహన్‌నాయుడు, సభ్యులు చవ్వా రంగనాథరెడ్డి, సిబ్బంది విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీవద్దిరాల పెద్దమ్మతల్లి వార్షికోత్సవం

యాడికి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త



పెద్దమ్మతల్లిని అలంకరించిన దృశ్యం

మండలంలోని రామరాజుపల్లి గ్రామ సమీపంలోని కొండమీద వెలసిన శ్రీవద్దిరాల పెద్దమ్మతల్లి 10వ వార్షికోత్స వ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం అమ్మవారికి అర్చకులు మక్కాల మల్లికార్జున అభిషేకాలు నిర్వహించి అనంతరం పట్టువస్త్రాలు, వివిధ రకాల పూలమాలలతో అలంకరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్షికోత్స వాన్ని పురస్కరించుకుని గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహిం చారు. హాజరైన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అదేవిధంగా పలువురి సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వార్షికోత్సవం సందర్భంగా పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంతం కిక్కిరిసిపోయింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు గావించారు.

## గృహప్రవేశానికి హాజరైన టిడిపి నాయకులు

అమడగూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త



విందులో పాల్గొన్న టిడిపి నాయకులు

అ వ ం డ ॅ గ ॅ ా ర ం ॅ ం మండలంనఏ. వుట్లవాండ్లవల్లి గ్రామానికి చెందిన టిడిపి యువ నాయకుడు పాతపాలెం రవికుమార్ గృహప్ర వేశం కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీసత్యసాయి జిల్లా, అనంతపురం జిల్లా టిడిపి నాయకులు, పార్టీ కార్యకర్తలు, బంధువులు, మిత్రులు వేలాదిగా తరలివచ్చి రవి కుటుంబసభ్యులను ఆశీర్వదించి తమ జ్ఞాపకార్థం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి ప్రధాన కార్యకర్తలు సర్వేయర్ సురేంద్రబాబు, డిష్ నారాయణరెడ్డి, బాబ్జాన్, నరసింహులు, కృష్ణ, డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వివిధ పార్టీల నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## విద్యాంజలి 2.0 కార్యక్రమంపై అవగాహన



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పుట్లూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

మండలంలోని అన్ని పాఠశా లల్లోని ప్రధానోపా ధ్యాయులకు శుక్రవారం విద్యాంజలి 2.0 కార్యక్రమంపై ఒక రోజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యాంజలి 2.0 ద్వారా పాఠశాలల్లో వాలంటీర్ల భాగస్వామ్యాన్ని పెంపొందించడం, సిఎస్ఆర్ భాగస్వామ్యాలను ప్రోత్సహించడం, విద్యా నాణ్యతను మెరుగుపరచడం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు శ్రీదేవి, ఎం.ప్రేమకుమార్, హెచ్ఆర్ఏజే స్టేట్ కన్వీనర్ గుత్తా భాస్కరనాయుడు, ఎపిఎంఎస్ చైర్మన్ డి.నారాయణస్వామి పాల్గొని విద్యాంజలి కార్యక్రమం అమలు విధానం, వాలంటీర్ల నమోదు ప్రక్రియ, పాఠశాలల పాత్ర తదితర అంశాలపై సవివరంగా వివరించారు. రిసోర్స్ పర్సన్స్‌గా కడవకల్లు క్లస్టర్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు జి.శంకర్‌రెడ్డి, జి.సూర్యప్రభాకర్‌లు విద్యాంజలి ద్వారా పాఠశాలలకు కలిగే ప్రయోజనాలు, ఉత్తమ పద్ధతులపై వివరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

